# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



గురువారం 03 జూలై 2025


## ఇక ఇంటింటికి టిడిపి..



**కడప కార్పొరేషన్ జూన్ 2 ప్రభాతవార్త:**

సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో ఏడదిగా సుపరిపాలన కొనసాగుతుందని టిడిపి పోలీట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులు రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డిలు అన్నారు. సుపరిపాలనతో తొలి అడుగు పేరుతో నెలరోజులపాటు ప్రతి కుటుంబాన్ని కలుస్తామన్నారు. సంక్షేమం, అభివృద్ధిపై ప్రచారం చేపడతామన్నారు. బుధవారం కడపలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో చెప్పినట్లుగా సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుంది. ఇప్పటికే పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత ఇసుక, దీపం సిలిండర్లు, అన్నా క్యాంటీన్లు ఇలా ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఇక పల్లెల్లో సీసీ రోడ్లు కలకలాడుతున్నాయని ఈ విషయం ప్రతి ఇంటికి వెళ్లి వివరిస్తామన్నారు. కడప జిల్లాలో 7.5 లక్షల కుటుంబాలు ఉన్నాయని, ప్రతి ఇంటికి వెళ్లి ఆ వివరాలు ప్రత్యేక ఐటి డిపి యాప్ లో నమోదు చేస్తామన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో రాక్షస పాలన సాగిందన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

## నేడు ప్రైవేటు విద్యా సంస్థల బంద్

**రాజంపేట, జూలై 2 ప్రభాతవార్త**

చర్చలు విఫలం కావడంతో నేడు జరిగే ప్రైవేటు విద్యాసంస్థల యధావిధిగా కొనసాగుతుందని జిల్లా ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్ కార్యదర్శి ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థల పట్ల కొందరు అధికారులు ఏకపక్ష నిర్ణయాలతో దాడులు జరపడం, నోటీసులు జారీ చేయడం లాంటి సంఘటనలతో విద్యాసంస్థలు ఆందోళనలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్త ప్రైవేటు సంస్థల కమిటీ పిలుపుమేరకు జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థలు మూసివేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమయాయని చెప్పారు. తమ డిమాండ్ల సాధన కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమకు సహకరించాలని కోరారు.

### రెండు కుగ్రామాలకు

## రోడ్డు సౌకర్యానికి గ్రీన్ సిగ్నల్

### పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ చీఫ్‌తో లంకా దినకర్ చర్చలు



ఏకిన పల్లి రహదారి దుస్థితి ఇదే...



బగ్గిడిపల్లికి వెళ్లే రహదారి దుస్థితి

**రాజంపేట, జూలై 02, ప్రభాతవార్త:**

రాజంపేట మండలంలో మారుమూల కుగ్రామాలైన బగ్గిడ పల్లి, ఏకిన పల్లి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు మార్గం సుగమం అయింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు రాష్ట్ర 20సూత్రాల కమిటీ చైర్మెన్ లంకా దినకర్‌ను కలిసి రెండు కుగ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, గత 20ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాలేదని వివరించారు. గతంలో రాజంపేట డీఎఫ్ఓగా పనిచేసిన వివేక్ ఇప్పటికే ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు అవసరమైన నివేదికను ప్రభుత్వానికి పంపారని తెలిపారు. రోడ్డు ఏర్పాటుకు అటవీ భూమి, చెట్లు పోతాయని అందుకు ప్రత్యామ్నాయంగా అవసరమైన భూమిని ఇచ్చేందుకు నివేదిక పంపారని వివరించారు. అంతేకాకుండా 37లక్షలు పరిహారానికి ప్రత్యామ్నాయంగా ఇస్తే సరిపోతుందని వివరించారు. ఈ నివేదికను లంకా దినకర్ పరిశీలించి రాష్ట్ర పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ చీఫ్‌తో బుధవారం చర్చించారు. ఇప్పటికే నివేదిక సిద్ధంగా ఉన్న నేపథ్యంలో వీలైనంత త్వరగా రెండు కుగ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకు ఇంజనీరింగ్ చీఫ్ సానుకూలంగా స్పందించారని త్వరలోనే రెండు కుగ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేలా చర్యలు చేపడతామని తెలిపారని రమేష్ నాయుడు తెలిపారు. అలాగే కడప-రేణిగుంట ప్రధాన రహదారి(అన్నమయ్య ప్రాజెక్టు ముఖద్వారం)నుంచి పులపత్తూరు వరకు 2021లో భారీ వర్షాల వల్ల రోడ్డు సర్వనాశనం అయిందని ఆకేపాడు గ్రామాలకు ఈ రోడ్డు ఒక్కటే ప్రధాన రహదారి అని వివరించారు. ఈ మేరకు ఆర్అండ్‌బి చీఫ్ ఇంజనీర్‌తో చర్చించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రమేష్ నాయుడు తెలిపారు. కాగా ప్రధాన రహదారి నుండి పులపత్తూరు వరకు రహదారి అభివృద్ధి విశయమై 'వార్త' రాజంపేట ఆర్అండ్‌బి ఈఈ సహదేవ రెడ్డిని వివరణ కోరగా ఇప్పటికే ఈ రహదారి అభివృద్ధికి 4కోట్లతో ప్రతిపాదనలు ఎండీఆర్ కింద పంపించినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనట్లు అయితే పనులు చేపడతామని వివరించారు.

# కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు చర్యలు





**రాయచోటి, జూలై 02 ప్రభాత వార్త**

స్వర్ణాంధ్ర 2047 విజన్ అమలులో భాగంగా రాయచోటి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు విశేష కృషి చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో స్వర్ణాంధ్ర2047 విజన్ అమలులో భాగంగా రాయచోటి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కమిటీ సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాయచోటి ఆర్డీఓ, ఎంపీడీఓలు, తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన సంవత్సరంలోనే అభివృద్ధి ఫలితాలు ఏ విధంగా ఉన్నాయో చూస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోషల్ ఇంజనీరింగ్ అనే సిద్ధాంతం తో ముందుకు వెళ్తున్నారన్నారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజలు భాగస్వామ్యమై గ్రామస్థాయి నుండి పట్టణ స్థాయి వరకు చేయి చేయి కలిపి పనిచేస్తే తప్పకుండా స్వర్ణాంధ్ర2047 విజన్ సాధ్యమైతుందని తెలిపారు. రాజకీయ నాయకులు, ఉద్యోగస్తులు కలిస్తే ఒక మెరుగైన అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 175 నియోజకవర్గాలకు సంబంధించి ఒక సిస్టం ని ఏర్పాటు చేసారని...నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ యూనిట్‌కు ఎమ్మెల్యే అధ్యక్షుడిగా ఉంటారన్నారు. వైస్ చైర్మన్ గా ఆర్డీఓ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారన్నారు. నియోజకవర్గ కేంద్రానికి చెందిన ఎంపీడీవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారని మంత్రి తెలిపారు. దాదాపు 24 కోట్ల రూపాయలతో ఈ క్రోమాకేర్ యూనిట్లను ఏర్పాటు చేయడం అయ్యిందని తెలిపారు. గువ్వల చెరువు టన్నెల్ కూడా 950 కోట్లతో టెండర్లకు పిలుస్తున్నామన్నారు. కడప నుండి పీలేరు వరకు ఫోర్ లైన్ రెండు ప్యాకేజీ రోడ్లు వస్తున్నాయని తెలిపారు. గండి రోడ్డు కూడా మరమ్మతులు చేస్తున్నామని, రింగురోడ్ కూడా ఫోర్ లైన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కార్యాలయంలో ఐదు మంది సచివాలయ సిబ్బంది చొప్పున ఆరు నియోజకవర్గాల్లో 30 మంది చొప్పున పనిచేయడానికి సచివాలయ సిబ్బందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్ధేశించిన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. డేటా మేనేజ్మెంట్, డేటా అనాలసిస్ లో సచివాలయ సిబ్బంది అత్యంత చురుకుగా పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్2047 తీసుకొస్తే దానికి అనుబంధంగా రాష్ట్రంలో స్వర్ణాంధ్ర2047 విజన్ రూపకల్పనకు నిరంతర కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులు తమ ఇళ్ల పైకప్పుపై సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేసుకోనేలా విస్తృత అవగాహన కల్పించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డిఓ శ్రీనివాసులు, నియోజకవర్గ మండలాల తహసిల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సుపరిపాలనకు తొలి అడుగు



**ఒంటిమిట్ట జూన్ 02( ప్రభాతవార్త)**

ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం పంచాయతీలో బుధవారం పంచాయితీ నాయకులు , కార్యకర్తలు కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పాలనపై ప్రజలకు తెలియజేయు నిమిత్తం ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజంపేట నియోజకవర్గ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి. జగన్మోహన్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పంచాయతీ ప్రజలు స్థానిక టిడిపి నాయకులు హర్షద్వానాలు పలుకుతూ బాణా సంచాలతో, గజమాలతో స్వాగతం పలికారు. సుపరిపాలనకు తొలిమెట్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షులు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి సుపరిపాలన గురించి చేతి పత్రాలు అందిస్తూ పంచాయతీ ప్రజలకు వివరించాడు. రాష్ట్ర ప్రజలు పార్టీపై పెట్టుకున్న నమ్మకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుస్థిరం చేస్తానన్నాడు. రాష్ట్రంలో మంచి పరిపాలన చేసి నిరూపిస్తారన్నాడు. అందుకోసము సుపరిపాలనకు తొలిమెట్టు అన్న కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నాడు. స్థానిక రైతులు, మహిళలు, యువకులు గ్రామంలోని సమస్యల గురించి ప్రస్తావించగా అనతి కాలంలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపాడు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల. నరసింహారెడ్డి, ఎస్. వెంకటరమణ, బొబ్బిలి రాయుడు, స్థానిక నాయకులు నామాల. వెంకటయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు వరం మహా గురుకులం





**బ్రహ్మంగారిమఠం జూలై 02 ప్రభాత వార్త**

నాణ్యమైన విద్య, అధునాతన వసతులతో రూపుదిద్దుకున్న డా. బి.ఆర్. అంబేద్కర్ (బాలుర) మహా గురుకులం విద్యాలయం పేద విద్యార్థుల పాలిట వరమైన మండలంలో తోట్లపల్లిలో నూతనంగా ఏర్పాటైన అంబేద్కర్ మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో ఆకాడమిక్ భవనాల్లో తరగతులు, వసతి గృహ భవనాల కలెక్టర్ డా: చెరుకూరి శ్రీధర్, ఎస్ పి అశోక్ కుమార్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ,ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బి.మఠం మండల కేంద్రానికి సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న డా. బి.ఆర్. అంబేద్కర్ మహా గురుకులం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు వచ్చిందన్నారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు విద్యా వసతులు కల్పించగల సామర్థం ఉన్న ఈ బాలుర మహా గురుకులంలో.. ఈ విద్యా సంవత్సరానికి గాను 640 మంది విద్యార్థులతో అడ్మిషన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ 2016 లో ఈ గురుకులం ప్రాజెక్టు నిర్మాణానికి సంబందించి అనుమతులు, టెండర్లు కూడా పూర్తి చేసి రూ. 21 కోట్ల వ్యయంతో మహా గురుకులం నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందన్నారు. సంబందిత పనులను ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందన్నారు. కానీ గత ప్రభుత్వంలో మిగిలిన పెండింగ్ పనులను పూర్తి చేయడంలో అలసత్వం వహించిందన్నారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ వారి ప్రత్యేక చొరవతో రెండు వారాల్లోనే పెండింగ్ లో ఉన్న ఫర్నిచర్, కిచెన్ సామగ్రి, కంప్యూటర్స్ తదితర వస్తువులను సమకూర్చడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో అన్నింటికీ మూలం ఒక్క విద్యనే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. ఆటస్థలం మరియు మొక్కల పచ్చదనం పనులకు సంబంధించి.. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి.. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం తరగతి గదులు, హాస్టల్ గదుల వసతులను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటిన అనంతరం క్రీడా మైదానం, రోడ్లను పరిశీలించారు. విద్యార్థులతో కలసి సంపక్తి బోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిదులు, టీడీపీ నాయకులు ప్రజులు తది తరులు పాల్గొన్నారు.

## పక్కా స్కెచ్‌తో చెన్నై ఐబీ అధికారుల ఆపరేషన్ రాయచోటి

### ఉగ్రవాదులకు షెల్టర్ జోన్‌గా రాయచోటి... ఉగ్ర మూలాలు వెలిక్కి తీయడంలో ముబైల్ కీలకం

### తీగ లాగితే ఉగ్ర డొంక కదులుతుందా?.. ఇంకా ఉగ్ర మూలాల కోసం 100మంది పైబడి పోలీసుల అన్వేషణ

**రాజంపేట, జూలై 02, ప్రభాతవార్త:**

ఉగ్రవాదులకు రాయచోటి షెల్టర్ జోన్‌గా మారిందా? 30ఏళ్ల పాటు రాయచోటిలో ఉన్న వారి కదలికలు బాహ్య ప్రపంచానికి తెలియలేదు. చెన్నై ఇంటలిజెన్స్ బ్యూరో అధికారులకు ఓ కీలక కేసు విచారణ సంధర్భంగా దొరికిన సమాచారంతో రాయచోటిలో ఉగ్ర వాదులు మారు పేర్లతో మకాం వేసి ఉన్నట్లు తెలుసుకున్నారు. అయితే వారి ప్రస్తుత పరిస్థితి ఏమిటి. కదలికలు ఎలా ఉన్నాయి. వారికి అండగా ఇంకా స్లీపర్ షెల్స్ ఉన్నాయా? తదితర సమాచారాన్ని పక్కాగా తెలుసుకునేందుకు చెన్నై నుంచి ఐబీ అధికారులు రాయచోటికి చేరుకున్నారు. జిల్లా ఎస్పీకి పక్కా సమాచారం అందించారు. ఉగ్రవాదులను పక్కాగా పట్టుకోవాలంటే ఫోర్స్ అవసరం అని చెప్పినట్లు సమాచారం. దీంతో జిల్లా ఎస్పీ రాజంపేట, రాయచోటి, మదనపల్లె సబ్ డివిజన్‌ల నుంచి మెరికల్ లాంటి యువ పోలీసులను వారికి అండగా పంపించారు. సోమవారం ఉదయం నుంచే ఆయా పోలీస్ స్టేషన్ల నుంచి వెళ్లిన పోలీసులంతా కొత్తపల్లెలోని ఉగ్రవాదులు అబూబకర్ సిద్దిఖీ, మొహమ్మద్ ఆలిలు ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే ఒక్కసారిగ ఇంటికి చాలా దూరం వరకు పోలీసులను రంగంలోకి దింపి నేరుగా ఐబీ అధికారులు అర్ధరాత్రి దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఎల్‌కే అద్వాని రథయాత్ర సంధర్భంగా జరిగిన బాంబు పేలుడు ఆ తర్వాత చెన్నై, కోయంబత్తూర్, తిరుచ్చి కేరళలో జరిగిన బాంబు పేలుళ్ల కేసులో కూడ ఇద్దరు సోదరులు ప్రధాన నిందితులు. ఈ బాంబు పేళుల్ల కేసులు దర్యాప్తు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో వీరికి సంబంధించిన సమాచారం మరి కొందరు ఉగ్ర మూలాలతో సంబంధం ఉన్న వారి నుంచే ఐబీ అధికారులకు సమాచారం దొరికి ఉంటుందని తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తే 95లో రాయచోటికి వచ్చిన తర్వాత కూడ ఉగ్రవాద ముఠాలతో సిద్దిఖీ, ఆలీ సంబంధాలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. దీనికి తోడు వారింట్లో ఉగ్రవాద సాహిత్యం, పేళుళ్లకు ఉపయోగించే ప్రమాదకరమైన సామాగ్రి లబించడం చూస్తే ఉగ్ర మూలాలు ఇంకా కొనసాగుతున్నట్లు ఐబీ అధికారులు భావిస్తున్నారు. ఇకపోతే 30ఏళ్లుగా రహస్యంగా ఎవరికి తెలియకుండా స్థిరపడి పోయిన ఇద్దరు కేవలం వ్యాపారమే చేసుకుంటున్నారా ఉగ్రవాద కార్యకలాపాలు విస్తరింప చేస్తున్నారా, ఇంకా రాయచోటి కేంద్రంగా ఇంకా ఎవరిని అయినా ఈ కార్యకలాపాలలోకి దించేందుకు ప్రయత్నాలు చేశారా, చేసి ఉంటే ఎంత మంది అలా వీరి ఆధ్వర్యంలో నెట్ వర్క్ ఉంది తదితర సమాచారాన్ని సేకరించే పనిలో చెన్నై ఐబీ అధికారులు నిమగ్నం అయ్యారు. వీరి నుంచి ఫోన్లు కూడ స్వాధీనం చేసుకొని వాటి ద్వారా వీరి కదలికలపై సమాచారాన్ని క్రోడీకరిస్తున్నట్లు తెలిసింది. ఐబీ అధికారులకు ఇంకా ఏమైనా వీరి ఇళ్లలో సమాచారం దొరికిందా అనే విశయం స్పష్టంగా తెలియలేదు. అయితే వీరికి సంబంధించిన మొత్తం సమాచారం అంతా జల్లెడ పట్టేందుకు ఇంకా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెళ్లిన పోలీసులు రాయచోటిలోనే ఆపరేషన్‌లో పాల్గొంటున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా ఉగ్ర మూలాలు రాష్ట్రంలోని రాయచోటి వైపు వేలెత్తి చూపేలా ఇద్దరు దొరికారు. అయితే ఈ ఉగ్ర మూలాలు సమాచారం మొత్తం బయటపడితే ఏ మేరకు వీరు లోతుగా కార్యకలాపాలు జరిపి ఉన్నారన్న సమాచారం బయట పడుతుంది. ప్రశాంతమైన రాయచోటిలో ఉగ్ర మూలాలు బయట పడటంతో ఒక్కసారిగా ప్రజల్లో ఉగ్రవాద కార్యకలాపాలపై చర్చనీయాంశంగా మారింది. ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఆపరేషన్ రాయచోటి తీగ లాగితే ఎక్కడెక్కడ డొంక కదులుతుందో సిద్దిఖీ, ఆలీ ఇంటరాగేషన్ తరువాత స్పష్టం కానుంది. వీరిద్దరిని చెన్నై ఐబీ అధికారులు అదుపులోకి తీసుకుపోయిన నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అనుమానితులపై డేగ కన్నుతో చూస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ అధికారులకు అంతర్గతంగా అలర్ట్ ఆదేశాలు పంపించారని తెలుస్తోంది.






## చౌక దుకాణం ప్రారంభోత్సవం

**ఒంటిమిట్ట జూన్ 02( ప్రభాతవార్త)**



ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామం లోని నెంబర్ 03 చౌక దుకాణాన్ని బుధవారం రాజంపేట నియోజకవర్గ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి. జగన్మోహన్ రాజు ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు పూలమాలలతో ఆ గ్రామంలోకి స్వాగతం పలికారు. అనంతరం ఆయన నెంబర్ 03 చౌక దుకాణాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోపిడీ ప్రభుత్వంలో దోపిడీ చేసేందుకు ప్రజా పంపిణీ వ్యవస్థను అడ్డగోలుగా మార్చి రాష్ట్ర ప్రజలకు ఇబ్బంది కలిగించేలా చేసిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజా సౌలభ్యం కొరకు పాత పద్ధతిలో రేషన్ బియ్యాన్ని సక్రమంగా అందించేందుకు రేషన్ దుకాణాల ఏర్పాటుకు కంకణం అటుకుందన్నాడు. తెలుగుదేశం పార్టీ హయాంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నాడు. ప్రజా ప్రయోజనాల లక్ష్యంగా రేషన్ దుకాణాలు పనిచేస్తాయన్నాడు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గజ్జల .నరసింహారెడ్డి, ఏ వన్ కాంట్రాక్టర్ ఎస్ వెంకటరమణ, కొత్తపల్లి. బొబ్బిలి రాయుడు, నామాల. వెంకటయ్య ,సుబ్బరాయుడు, నాగమణి రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి.

**తొండూరు జులై 2 ప్రభాతవార్త:**

తొండూరు మండలంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డుపై వాహనదారులకు ఎస్సై గణ మద్దిలేటి పలు సూచనలు చేశారు.హెల్మెట్ పెట్టుకోపోతే పోలీసులు ఫైన్ వేస్తున్నారు.లోకల్ లో తిరిగేటప్పుడు కూడా హెల్మెట్ పెట్టుకుంటారా,ఇది మాకు తెలవని ఊరా,దూరం ప్రయాణించే వారికి చెప్పొచ్చు కదా,లోకల్ లో తిరిగే మాకెందుకు అనే వారి కోసమే ఈ ఫోటో పెట్టడం జరిగింది.పైన కనిపించేఫోటోసరిగ్గాచూస్తేఅర్థమవుతుంది.మన మధ్యలో ఉండాల్సిన రెండు నిండు ప్రాణాలు ఈ రోజు లేవు.పైన చనిపోయిన ఇద్దరు యువకులు వందల కిలోమీటర్ల దూరం వెళ్లట్లేదు.వాళ్ల సొంత ఊర్లోనే ఒక వాడ నుంచి మరొక వాడకు వెళుతున్నారు.హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల గమ్యానికి బదులు కాటికి పోవలసి వచ్చింది.యుక్త వయసులో ఉన్న పిల్లల మరణం ఆ తల్లిదండ్రులకు శోకాన్నీ తప్ప ఏం మిగిల్చింది? లక్షన్నరపెట్టి బండి కొంటున్నాం,కానీ వెలకట్టలేని మన ప్రాణం కోసం ఒక హెల్మెట్ పెట్టుకోలేక పోతున్నాం. ప్రమాదానికి కొత్త,పాత ఉండదు.ప్రాణం వెలగట్టలేనిది, పోతే దొరుకేది కాదు.జాగ్రతా!

## ఇంటింటా ప్రచారం

**నిమ్మనపల్లె, జులై 2 ప్రభాతవార్త :**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని స్థానిక మోడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు భాస్కరన్, సుధాకర్ ప్రచారం చేపట్టారు. గత రెండు రోజులుగా ద్విచక్రవాహనంలో చిన్న సౌండ్‌బాక్స్ ఏర్పాటుచేసి ప్రజలకు వినిపించేలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తల్లికి వందనం ఉచిత యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు ఇస్తామన్నారు. కరపత్రాలను ముద్రించి చిన్నారి తల్లిదండ్రులకు వాటిని పంచిపెట్టి ప్రైవేటు బడులు వద్దు ప్రభుత్వ బడులే ముద్దు అని తెలియజేశారు. ఇప్పటి వరకు ఎవరూ పాఠశాలల గురించి ఇలాంటి ఇంటింటా ప్రచారంచేపట్టకపోవడం గమనార్హం.

## అనుమానస్పద స్థితిలో యువకుడు దుర్మరణం

**యర్రగుంట్ల జులై 2 ప్రభాతవార్త**

పట్టణ పరిధిలోని కడప రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో పాత గోడౌన్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో దుర్మరణం చెందిన సంఘటన సంచలన రేకెత్తించింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వెంటనే బుధవారం ఉదయాన్నే ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్ బాబు సంఘటన స్థలాన్ని మొదటగా పరిశీలించారు. తరువాత జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కడప నుంచి డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తర్వాత క్లూస్ టీం సంఘటన స్థలాన్ని చేరుకొని అనుమాన స్పదం కూడిన చోట వేలిముద్రలను సేకరించారు. మృతుడు కడప లోని మాసాపేటకు చెందిన షేక్షావలిగా గుర్తించారు. మృతుడి ముఖమంతా రక్తం మడుగులో పడి ఉంది. మృతుడి మొఖంపై బండరాలతో కొట్టి హత్య చేసినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరంగా చేస్తున్నామని ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్ బాబు తెలియజేశారు.

## మెస్‌లను మంచి సంస్థకు అప్పగించాలి

**వేంపల్లె: జూలై 02 (ప్రభాత వార్త):**



రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీలకు సంబంధించి హాస్టల్ మెస్ లను మంచి సంస్థకు అప్పగించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కోరారు. ఆ మేరకు ఆయన బుధవారం ఉండవల్లిలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. నాణ్యమైన ఆహారం, సరిగా భోజనం పెట్టడం లేదని, విద్యార్థులతో మెస్ నిర్వాహకులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. భోజన సరఫరాలో అంకితభావంతో పనిచేస్తున్న అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థకు లేదా ఇతర ఏదైనా మంచి సంస్థకు అప్పగించాలని మంత్రి లోకేష్ కు విన్నవించారు. ఈ విషయంపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని మంత్రి లోకేష్ కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విన్నవించారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎంపీడీవో



**యర్రగుంట్ల జులై 2 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో బుధవారం పారిశుద్ధ పనులను ఎంపీడీవో వెంకటరమణయ్య పరిశీలించారు. గ్రామంలో చెత్త సేకరణ, శుభ్రత పనులను పరిశీలించారు. ప్రజలకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే మనకు ఆరోగ్యం బాగుంటుందని, కాబట్టి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ప్రజలకు తెలిపారు. పారిశుద్ధ్య పనులకు ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శరత్ కుమార్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడి సేవలు మరువలేనివి

**సుండుపల్లె, జులై 02, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు సి జి కె రామచంద్ర రాజు పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి, సేవలు మరువలేనివని ప్రదానో పాధ్యాయులు చంద్ర శేఖర్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల బదిలీ పై వెళ్ళిన ప్రధానోపాధ్యాయులు సి జి కె రామ చంద్ర రాజు, ఉపాధ్యాయులు ఉమా శంకర్, రమేష్ లకు బుదవారం పాఠశాల లో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ బదిలీ అయిన రామచంద్ర రాజు పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసి తనదైన ముద్రను అభివృద్ధి రూపం లో చూపించాడని, ఈ పాఠశాల ఈ గ్రామం ఆయన సేవలను కలకాలం గుర్తుంచుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు ఉమా శంకర్ ,రమేష్ చేసిన కృషిని కొనియాడారు.మీరు ఈ పాఠశాలతో ఏర్పరుచుకున్న అనుబంధం ఎనలేనిదని విద్యార్థుల భావోద్వేగాలే దీనికి నిదర్శనమని కొనియాడారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గుండమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు బదిలీ ఉపాధ్యాయులను శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానించి మెమెంటో లు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు.

## పోలీసుల తీరు కు నిరసనగా ఎమ్మార్పీఎస్ ధర్నా

**మదనపల్లి క్రైమ్, జులై 2 ప్రభాతవార్త.**

మదనపల్లె రెండవ పట్టణ పోలీసుల ఏకపక్ష తీరును నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ శ్రేణులు బుధవారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బాధిత వైఎస్ఆర్సీపికి చెందిన కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూగత నెల 30వ తేదీ సోమవారం సాయంత్రం ఆర్కే పార్కింగ్ స్థలం నుంచి తన కారును వెనక్కి తీస్తుండగా రామారావు కాలనీ కి చెందిన సుధాకర్ అదే సమయంలో పార్కింగ్ లోకి పెట్టేందుకు తన కారును తేవడంతో రెండు కార్లు ఇరుక్కుపోయాయన్నారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య మాటా.. మాటా పెరగడంతో ఆగ్రహించిన సుధాకర్ దుర్భాషలాడి బండరాయితో తనపై దాడికి యత్నించాడన్నారు. ఈ లోపు స్థానికంగా ఉన్న గొల్లపల్లి కి చెందిన యువకులు అక్కడికి చేరుకుని సుధాకర్ తో గొడవ పడ్డారన్నారు. తరువాత ఎవరి దారినవారు వెళ్లిపోయామన్నారు. అయితే సుధాకర్ కు బంధువు అయ్యే టిడిపి కార్యకర్త కలుగజేసుకుని, సమసిపోయిన సమస్యను పెద్దదిగా చిత్రీకరిస్తూ, పలుకుబడి ఉపయోగించి అకారణంగా తనపై కేసు నమోదు చేయించడం జరిగిందన్నారు. అయితే ఆ కేసు నమోదు చేసిన పోలీసులు నేను ఇచ్చిన ఫిర్యాదు పై మాత్రం కేసు నమోదు చేయలేదన్నారు. ప్రజా ప్రతినిధిగా ఉన్న తనకే ఇలా జరిగితే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని పోలీసులను నిలదీశారు. దళితులపై వివక్ష చూపుతూ అణిచి వేయాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. తనను దుర్భాషలాడి, బండరాయితో దాడి యత్నించిన సుధాకర్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ శ్రేణులతో పాటు గొల్లపల్లి వాసులతో కలిసి స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. వెంటనే సుధాకర్ పై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నినదించారు. ఈలోపు సిఐ రామచంద్ర అక్కడికి చేరుకొని సాయంత్రం లోపు మీరిచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. దళితులను అణచివేసేందుకు కుట్ర జరుగుతోందని దానికి రాజకీయ రంగు పులుముతున్నారని ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్ర అన్నారు. ప్రజా స్వామ్యంలో పోలీసులు న్యాయం వైపు నిలబడాలే తప్ప అధికార పార్టీ కార్యకర్తలుగా పని చేయకూడదన్నారు. తమకు న్యాయం జరగని పక్షంలో అన్ని పార్టీలను, ప్రజాసంఘాలను ఏకం చేసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు హరి, రెడ్డిశేఖర్, బాబు, ఎమ్మార్పీఎస్ శ్రేణులు, గొల్లపల్లి వాసులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

**పీలేరు జూలై 2 ప్రభాతవార్త :**



ఇంటింట ప్రచారం నిర్వహి స్తున్న తెదేపా నాయకులు

విద్యార్థులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పీలేరు మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ మల్లెల రెడ్డి భాష అన్నారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచనల మేరకు పీలేరు పట్టణంలోని బ్రాహ్మణ వీధి, చర్చి వీధుల్లో వారు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ ఇంటింటా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనమైన విద్యను అందిస్తూ వారికి కావలసిన యూనిఫామ్ పుస్తకములు, విద్యకు సంబంధించిన మూడు వేల రూపాయలు విలువచేసే కిట్లను అందజేశారని వారు ఇంటింట ప్రచారంలో వివరించారు. మరిన్నిసంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మరోసారి చంద్రబాబు నాయుడుని అందరు ఆశీర్వదించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు గ్రామ క్లస్టర్ ఇంచార్జ్ ఎన్ అమర్నాథరెడ్డి, సీనియర్ నాయకులు జాఫర్, మీడియా కోఆర్డినేటర్ పోలిశెట్టి సురేంద్ర, క్లస్టర్ ఇంచార్జ్ ఇస్మాయిల్, 253 బూత్ ఇంచార్జ్ షమ,కో కన్వీనర్ మహబూబ్ బాషా, 251 బూత్ ఇంచార్జ్ మోధిన్ భాష, నౌలాక్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ

**బ్రహ్మంగారిమఠం జూలై 2 ప్రభాతవార్త :**



మండల కేంద్రంలోని హైస్కూల్ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారన్న ఫిర్యాదులు అందడంతో బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి శంషుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన, మరియు మండల విద్యాశాఖ అధికారి పుల్లయ్య, ఏ ఐ ఎస్ బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్, పాఠశాలలోని తరగతుల గదులన్నిటిని పరిశీలించడం జరిగింది. పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడాన్ని ఆయన గుర్తించినట్లు తెలిసింది.

## బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

**పెనగలూరు జూలై 2 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చక్రంపేట ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ గా పని చేస్తున్న కోలగట్ల పద్మజ ఫిజికల్ డైరెక్టర్ గా పని చేస్తున్న ఇండ్ల జయలక్ష్మిలను బుధవారం పాఠశాల ప్రాంగణంలో హెడ్మాస్టర్ లేబాకు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చక్రంపేట ఉన్నత పాఠశాల నుండి బదిలీపై వెళుతున్న ఈ ఇరువురికి ఉపాధ్యాయ బృందం దృశ్యాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా వారిరువురూ పాఠశాల విద్యార్థులకు అందించిన సేవలు గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి హరిప్రసాద్, అన్వర్ భాష, ప్రమీల,ప్రసాదరావు, సుదర్శన్, కృష్ణకుమారి, శ్రీవాణి, పరిమళ, మహేంద్ర,శివ నరసింహులు, ప్రసాదు, సతీష్ బాబు పల్గొన్నారు



## విధ్యార్ధినిలకు కంటి పరీక్షలు...

**ఖాజీపేట, జూలై 02, ప్రభాతవార్త:**

ఖాజీపేట మండల పరిధిలోని కె.సుంకేసుల గ్రామం వద్ద గల కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్ధులకు కడప నగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్ధులకు అవసరమైన మాత్రలు, కంటి చుక్కల మందును అందజేశారు. మరీ ముఖ్యంగా అవసరమైన విద్యార్ధులను పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు ఏర్పాటుచేసిన ప్రత్యేక వాహనం నందు పాఠశాల ఏఎన్ఎం మలికిరెడ్డి కళావతి ఆధ్వర్యాన పుష్పగిరి కంటి ఆసుపత్రిరి తీసుకువెళ్లి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. దాదాపు 25మంది విద్యార్ధులకు పుష్పగిరి కంటి ఆసుపత్రి నందు కంటి పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల ఏఎన్ఎం మలికిరెడ్డి కళావతి తెలిపారు. పాఠశాల నందు కంటి పరీక్షలు నిర్వహించిన ప్రముఖ నేత్ర వైద్యులు అమర్‌నాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## ఐ టీడీపీ నియోజికవర్గ అధ్యక్షునిగా రాము

**ఖాజీపేట, జులై 02, ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీలో పదవుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. తొలి నాళ్ల నుండి పార్టీని అంటి పెట్టుకొని ఉంటూ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేస్తూ పార్టీకి సేవలందిస్తున్న యువకులకు పలు పదవులు వరించాయి. అందులో భాగంగా మైదుకూరు నియోజికవర్గ ఐ టీడీపీ అధ్యక్షునిగా ఖాజీపేట మండలం పాటిమీద పల్లె గ్రామానికి చెందిన తుట్టే రాము యాదవ్‌ను నియమించారు. అలాగే ఖాజీపేట మండలం ఐ టీడీపీ అధ్యక్షునిగా ఖాజీపేట మండలం మిడుతూరు గ్రామానికి చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ చిత్రాల ఏసుపాదంలను నియమించారు. కాగా పదవులు పొందిన రాము యాదవ్, ఏసుపాదంలు ఈ సంధర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామన్నారు. ఈ సంధర్భంగా మంత్రి లోకేష్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పేదలకు వరం కేంద్ర ప్రభుత్వ పథకాలు



**బద్వేల్ అర్బన్, జూలై 2, , ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వ పథకాలు పేదలకు వరం లాంటివని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జనార్ధన్ పేర్కొన్నారు బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిల్లాలో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం లో భాగంగా అట్లూర్ మండలం, పంచాయతీ, గ్రామం లో సామాజిక భద్రత పథకాలు అయినటువంటి పి ఎమ్ ఎస్ పి వై పి ఎం జె బి వై, ఏపీ వై, తదితర పథకాలతో పాటు డిజిటల్ మోసాల గురించి వివరించారు . అనంతరం ఎల్డీమ్ మాట్లాడుతూ గ్రామం లో ని ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్సు కలిగి ఉండాలన్నారు , ఇన్సూరెన్సు ఉపయోగాలు ,పెన్షన్ ,ఆన్లైన్ మోసాలు గురించి తెలియజేస్తూ ఇన్సూరెన్సు లేని వారికి బ్యాంక్ లో కానీ ,ఆర్థిక అక్షరాస్యత కేంద్రం లో గాని ఇన్సూరెన్సు చేసుకోవచ్చని తెలిపారు, అనంతరం నోడల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో తెలిపిన విషయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు, అలాగే ఇన్సూరెన్సు పథకం లో ఇదివరకే చెరినటువంటి ఏ మహేశ్వరరెడ్డి గుండెపోటు తో మరణించడం వల్ల నామినీ , జీవిత భాగస్వామి అయిన లక్ష్మీనరసమ్మ కు ఇన్సూరెన్సు మొత్తం 200000 లు చెక్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్ దుష్యంత్ ,ఫీల్డ్ ఆఫీసర్ రాయుడు ,సర్పంచ్ ఎల్లమ్మ, సిఎఫ్ఎల్ నాగలక్ష్మి మరియు విఓఏ వేణుగోపాల్ , కృష్ణ తదితరులు హాజరయ్యారు

## కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం

**సిద్ధవటం జూలై 2 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ సిద్ధవటం అధ్యక్షుడు శనివారపు మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం సిద్ధవటం మండలం జ్యోతి గ్రామంలో సుపరిపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మోహన్ రెడ్డి వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు ఇంటింటికి చేరాయి అన్నారు. తల్లికి వందనం ఊహించిన విధంగా ఇంట్లో ఎంతమంది చదువుకున్న పిల్లలు ఉన్నా ఒక్కొక్కరికి 13000 చొప్పున అందరికీ డబ్బులు పడడంతో వారి కుటుంబాల్లో సంతోషాలు అవధులు దాటాయని అన్నారు. ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వరం కానుంది అన్నారు. రాబోయే నాలుగు సంవత్సరాలు పేదరికం లేని రాష్ట్రంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి వెంకటసుబ్బారెడ్డి ముని రెడ్డి నల్ల గుండు వెంకటసుబ్బారెడ్డి పాలసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోవు బాగుంటే దేశం బాగుంటుంది

**ప్రొద్దుటూరు అర్బన్, జూలై 2 ప్రభాత వార్త :**



శ్రీ సద్గురు సమర్థ నారాయణ మహారాజుల వారి 35వ ఆరాధన మహోత్సవాలలో భాగంగా బుధవారం ఉప్పరపల్లె సమర్థ నారాయణ ఆశ్రమంలో శ్రీ ప్రభుదత్త మహారాజులవారు ఆశ్రమమునకు విచ్చేసి దేవతా మూర్తులకు అభిషేక, పూజాదులు నిర్వహించి, గణపతి, సరస్వతి హోమ పూర్ణాహుతి కావించారు. అనంతరం శ్రీ నారాయణ మహరాజ్ వారి పాదుకా పూజ నిర్వహించి భక్తులకు ప్రసాదం అందజేశారు. శ్రీ ప్రభుదత్త మహారాజులవారు భక్తులను ఉద్దేశిస్తూ ప్రసంగిస్తూ కలియుగంలో భక్తి ఆవశ్యకతను, గో ప్రాముఖ్యతను వివరిస్తూ భక్తులంతా ఆశ్రమ గోశాలలో గోసేవ విరివిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు,విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, చీతీరాల నాగార్జున,మారేళ్ళ మల్లికార్జునరావు,వంకదార వీరభద్రయ్య, జొన్నలగడ్డ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం కన్నా మన ప్రభుత్వమే మిన్న



**బద్వేలు, జూలై 2, ప్రభాతవార్త**

గత ప్రభుత్వంతో పోలిస్తే కుటుంబ ప్రభుత్వం ఒక ఏడాదిలోనే అధిక శాతం హామీలు అమలు చేయడంతో పాటు వాటిని ప్రజలలోకి తీసుకెళ్లి వివరిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని రఘునాథపురం 30 వ వార్డుతో పాటు పలు ప్రాంతాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టబోయే పథకాల గురించి వివరించారు. ఇందులో భాగంగా మహిళలకు ఉచిత సిలిండర్లు ,తల్లికి వందనం ద్వారా చదువుకునే ప్రతి బిడ్డకు డబ్బులు అందజేసి కుటుంబ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందన్నారు గత ప్రభుత్వంలో ఇంటిలోని ఒక విద్యార్థికి మాత్రమే అమ్మబడి డబ్బులు వేసిందని ,కానీ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలలో భాగంగా ఇంట్లోని చదువుకునే ప్రతి బిడ్డకు తల్లికి వందనం నిధులు అందజేసి పార్టీ సామర్థ్యాన్ని నిరూపించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, మరియు మున్సిపాలిటీ అధ్యక్షులు వెంగల్ రెడ్డి , మరియు నాయకులు నరసింహనాయుడు, చెన్నయ్య ,సుబ్బరాయుడు, శివ కృష్ణ, వెంకటసుబ్బయ్య, నారాయణరెడ్డి, సింగసాని విజయ్ (బుజ్జి) ఇతరులు పాల్గొన్నారు.

## చెరువు కబ్జా చేసిన గ్రామస్తులు..

**సుండుపల్లె, జులై 02,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని చిన్న గొల్లపల్లి గ్రామపంచాయతీ పూజారివాళ్ళపల్లి సమీపం లోని పెద్ద చెరువు ఆక్రమణకు గురైందని అదే గ్రామానికి చెందిన పూజారి రామాంజులు, శ్రీనివాసులు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. పూజారి వాండ్లపల్లె సమీపంలో పెద్ద చెరువు కింద సుమారు 200 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉందని, ఆ గ్రామంలోని కొందరు వ్యక్తులు చెరువును కబ్జా చేసి బోరు వేసి పంటలు సాగు చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించి గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వారు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యం



**బద్వేలు జూలై 2 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని అందులో భాగంగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బద్వేల్ మండలం రాజుపాలెం నందు సాయంత్రం బద్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ రితేష్ రెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే విజయమ్మలు మాట్లాడుతూ సూపర్ సిక్స్ ఆయా గ్రామీణ ప్రాంతాలలో తల్లికి వందనం నిధులు జమ అయ్యాయని సంబంధిత లబ్దిదారులతో చర్చించి వారి అభిప్రాయం తీసుకున్నారు. ఇక జూలై నెలలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలలో మరో 10 రోజులలోగా నిధులు జమచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అలాగే సూపర్ సిక్స్ హామీలలో భాగంగా మరో పథకమైన ఆర్టీసీ లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఆగస్టు 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలియజేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే గతంలో హామీ ఇచ్చిన అప్పరాజుపేటలో ఇంటిపట్టాలను అందించారు. అలాగే అట్లూరు మండలం వేమలూరు గ్రామంలో టీడీపీ నాయకులు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బొజ్జ రోషన్న , మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ రెడ్డి రామచంద్ర రెడ్డి , మన్యం రామిరెడ్డి , బైసానీ రామచంద్రారెడ్డి, అంకన్న వెంకటసుబ్బారెడ్డి, శేఖర్ రెడ్డి, సింగరయ్య, రాజు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుపరిపాలన తొలి అడుగు

**పోరుమామిళ్ల రూరల్, జూలై 2ప్రభాతవార్త:**



కూటమి ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి బుధవారం పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ జోరు వర్షంలో ప్రతి ఇంటికి తిరిగి టిడిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ ఒడి ప్రజల్లో సూపర్ సక్సెస్ అయిందని అన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత ప్రయాణం ప్రభుత్వం అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నీటి సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, చెన్ను రమణ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హత్యాచారం కేసులో నిందితులు అరెస్ట్

**దువ్వూరు, జూలై 02, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో జరిగిన హత్యాచారం కేసులో ఇద్దరు నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు మైదుకూరు రూరల్ ఇంచార్జ్ సీఐ మోహన్, ఎస్ఐ వినోద్‌కుమార్‌లు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గుడిపాడు గ్రామానికి చెందిన బాధిత మహిళను మాయ మాటలు చెప్పి మాయమాటలతో లోబర్చుకొని బాల నేరస్థుడు ఆమెను బలవంతంగా హత్యాచారం చేసి అనంతరం న్యూడ్ వీడియో మరియు ఫోటోలు బాల నేరస్థుడు యొక్క ఫోన్‌కు వాట్సాప్ ద్వారా పెట్టించుకొని వాటిని అడ్డుపెట్టుకొని మరొక్క సారి బాధిత మహిళను హత్యాచారం చేసినట్లు అలాగే సదరు ఫోటోలు, వీడియోలను కేసులోని రెండవ ముద్దాయి ఎర్రగుంట్ల కార్తీక్ కుమార్ రెడ్డి ఫోన్‌కు వాట్సాప్ ద్వారా పంపడంతో సదరు ముద్దాయి కార్తీక్ కుమార్ రెడ్డి వాటిని అడ్డం పెట్టుకొని బాధిత మహిళను బెదిరించి ఆమెను బలవంతంగా హత్యాచారం చేసిన కేసులో ఇరువురిని అరెస్ట్ చేశామన్నారు. నేరానికి ఉపయోగించిన 2మొబైల్ ఫోన్లను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులోని ముద్దాయిలను బుధవారం మండలంలోని గుడిపాడు క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

## ఉపాధి హామీ పనులపై సమీక్ష

**దువ్వూరు, జూలై 02, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని 23గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవన్‌లో ఎంపీడీఓ రామకృష్ణ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీలో శ్రామికుల సమీకరణ సంఖ్యను పెంచాలన్నారు. 100రోజులు పని చేసే విధంగా చూడవలసిన బాధ్యత క్షేత్రసాయి సిబ్బందిపై ఉందన్నారు. అలాగే ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలు, మొక్కల పెంపకానికి రాయితీలు ఇస్తారని వీటిని వినియోగించుకోవాలన్నారు. ప్రతి శ్రామికునికి సరాసరి వేతనం పడే విధంగా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీకి సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఏపీఓ లక్ష్మీ నారాయణ, ఈసి ప్రియాకం దర్శిని పాల్గొన్నారు.

## అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న యువకుడు

**రాజుపాళెం, జూలై 02, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వెలవలి గ్రామానికి చెందిన చిన్నబ్బి గార్ల చిన్న నాగరాజు(44) అనే యువకుడు మంగళవారం అర్ధరాత్రి సొంత ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విశయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రాజారెడ్డి తెలిపారు. వివరాళ్లోకి వెళితే..జీవనోపాధి కోసం ప్రొద్దుటూరులో చెరుకు రసం మిషన్‌ను నడుపుకుంటూ ప్రైవేట్ సంస్థలో అప్పులు తీసుకొని చెల్లించలేక, వ్యాపారాలు లాభసాటిగా లేక బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి బార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

**రాజుపాళెం, జూలై 02, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కొర్రపాడు గ్రామానికి చెందిన మహబూబ్ షరీఫ్ అనే యువకుడు ప్రొద్దుటూరులో కూలి పని ముగించుకొని సాయంత్రం తన ద్విచక్ర వాహణంలో ఇంటికి వచ్చే క్రమంలో కొర్రపాడు గ్రామ శివార్లలో ద్విచక్ర వాహణం అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురై గాయాల పాలయ్యాడు. ఇతన్ని వెంటనే 108 వాహణంలో చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

## అవినీతి ఆరోపణలు పై విచారణ

**కలికిరి జూలై 2 ప్రభాతవార్త:**

వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంపై అవినీతి ఆరోపణలు పై అధికార యంత్రాంగం విచారణ చేపట్టటం అదేవిధంగా కళాశాలలో పని చేస్తున్న క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది విధులలో కూడా తమకు అనుకూలంగా పనిచేస్తున్న సిబ్బందిని తారుమారు చేసి జీతాలు మార్పించి మంజూరు చేయటం దింతో విసి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంపై విచారణ జరిపి నివేదికలు అందించాలని కమిటీని నియమించింది. దింతో మంగళవారం కమిటీ సభ్యులు వ్యవసాయ కళాశాలకు చేరుకొని విచారణ చేపట్టింది ఆ విచారణలో కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందితో విచారణ జరిపారు. ఏది ఏమైనప్పటికి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం పై అధికారి యంత్రం వేటు వేసి కొత్త ప్రిన్సిపాల్ ని నియమించి విద్యార్థిని విద్యార్థులకు మంచి విద్యని అందించే విదముగా ప్రభుత్వం చర్యలుతీసుకోనునట్లు ప్రచారం జరుగు తున్నది.

## నేడు ప్రవేట్ విద్యాసంస్థల మూసివేత..



కడప కార్పొరేషన్, జూలై 2 ప్రభాతవార్త:
విద్యా సంస్థల యాజమాన్యాలపై అధికారుల ఒత్తిడి తగ్గించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసనగా.. నేడు ప్రైవేటు విద్యా సంస్థలు మూసి వేస్తున్నామని, బంద్‌కు మద్దతు ఇవ్వాలని అపస్మా రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ, రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇలియాస్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పివి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షులు బి. గంగయ్య కోరారు. బుధవారం కడపలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలపై అధికారుల వేధింపులకు అధికమయ్యాయన్నారు. సమస్యల పరిష్కారం కోసమే విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నామన్నారు. పేద వర్గాలకు సంబంధించి 25 శాతం పిల్లలకు ఉచితంగా చదువు చెప్పాలని కేంద్ర ప్రభుత్వ యాక్ట్ ఉన్నా అందులోని పూర్తి స్థాయి నిబంధనలు అధికారులు పాటించడం లేదన్నారు. అలాంటి విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ అందించాల్సి ఉందన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ. 90 వేల వరకు ఖర్చు చేస్తుండగా, అందులో సగం ఇవ్వాలని తాము కోరుతున్నామన్నారు. అయితే ప్రభుత్వం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ యాక్ట్ అనేకచోట్ల దుర్వినియోగమవుతోందన్నారు. సేవా దృక్పథంతో పనిచేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల పట్ల చిన్న కారణాలకే అధికారులు బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా అనేక సమస్యలతో నిర్వహిస్తున్న బంద్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అపస్మా జనరల్ సెక్రెటరీ శివ శంకర్ రెడ్డి, ట్రెజరర్ నాగసుబ్బారెడ్డి, నగర అధ్యక్షులు మైతిలి, జనరల్ సెక్రెటరీ పద్మనాభరెడ్డి, కరస్పాండెంట్లు కృష్ణారెడ్డి, వంశీ, బేగం పాల్గొన్నారు.

## మానవతా దృక్పథంతో సహాయహస్తం

చిన్నమండెం జూలై 02 ప్రభాతవార్త
గాలివీడు మండలంలోని అవులరెడ్డి గారి పల్లెకు చెందిన అవుల చిన్నప్ప రెడ్డి అనారోగ్య సమస్యలతో శస్త్రచికిత్స కోసం ఆర్థిక సహాయం అవసరంగా ఉండటంతో, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారిని వారి ఇంటి వద్ద సహాయం కోరారు. స్పందించిన మంత్రి మానవతా దృక్పథంతో సహాయహస్తం అందించారు. మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.10,000/ ఆర్థిక సహాయాన్ని అవుల చిన్నప్పకు అందించారు.



## సేవ చేయడంలోనే ఆనందం ఉంది

రాయచోటి జూలై 2 ప్రభాత వార్త :
సేవ చేయడంలోనే ఆనందం ఉంటుందని ప్రతి పేదవాడికి ఎంతో కొంత సహాయార్థం సేవ చేసినట్లయితే దేవుడు కూడా మనకు సహకరిస్తాడని టోరింటో మెడిసిన్ కంపెనీ ఎంప్లాయ్ షేక్ జబివుల్ల అన్నారు. రాయచోటిలోని రాయుడు కాలనీలో ఎంపీపీ పాఠశాలలో బుధవారం పాఠశాల కు వితరనగా బెల్ (గంట) ను అందజేశారు. గత కొన్ని రోజుల క్రితం పాఠశాలకు ఏదో ఒకటి సహాయార్థం చేయాలని పాఠశాల సిబ్బంది షేక్ జబీబుల్లాకు తెలియజేయడంతో ఆ హామీని నెరవేర్చినట్లు పాఠశాల హెచ్ఎం సురేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తన సంపాదనలో ఎంతో కొంత నిరుపేద విద్యార్థులకు ఖర్చు చేసినట్లయితే వారి రుణం దేవుడు ఏదో ఒక రూపంలో వారి బిడ్డలకు సహాయార్థంగా రుణపడి ఉంటారని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని పేదలకు సహాయార్థం ఉపయోగపడేలా చూడాల్సిన బాధ్యత ఎంతైనా తమపై ఉందని ఆయన అన్నారు. ఆయనతో పాటు రియల్ ఎస్టేట్ స్వామికొండ. ద్వారక మెడికల్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ శ్రీకాంత్ (హైదరాబాద్) నజీర్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలల బంద్

కాశినాయన, జూలై 2 ప్రభాతవార్త :
రాష్ట్రంలో ప్రయివేటు పాఠశాలల యాజమాన్య అసోసియేషన్ కీలక ప్రకటన చేసింది. తమ సమస్యల పరిష్కారానికి డిమాండ్ కోరుతూ రేపు (గురువారం) రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేటు అన్ ఏయిడెడ్ పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఆహ్వానిస్తూనే.. కొందరు అధికారుల తీరు.. నోటీసుల జారీ వంటి వాటి పైన అసోసియేషన్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పుకొస్తున్నారు. తమ డిమాండ్లను పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ ఈ బంద్‌కు నిర్ణయించారు. కొంత మంది అధికారులు తీసుకున్న అన్యాయమైన, ఏకపక్ష నిర్ణయాలు ప్రయివేటు అన్ ఎయిడెట్ పాఠశాలల యాజమాన్యాలకు ఇబ్బందిగా మారాయి. గుర్తింపు రద్దు బెదిరింపులకు ప్రతిస్పందనగా రాష్ట్రంలోని అన్ని ప్రయివేటు పాఠశాలలు జూలై 3న మూసివేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం తమ వేదన అర్థం చేసుకొని తమ హక్కులను కాపాడాలని కోరుతున్నారు. నియమాలను పరిశీలించకుండా నోటీసులు చర్యలకు ఉపక్రమించ వద్దని అభ్యర్థిస్తున్నారు.

## నిధుల దుర్వినియోగంపై గ్రామ సభలో రచ్చ

కాశినాయన, జూలై 2 ప్రభాతవార్త :
మండలం కత్తెర గండ్ల గ్రామపంచాయతీలో గత నాలుగు సంవత్సరాల నుంచి లక్షలాది నిధులు దుర్వినియోగం అయ్యాయి అని గ్రామసభలో గ్రామ ప్రజలు పంచాయితీ అధికారులను నిలదీశారు. గత నాలుగు సంవత్సరాల నుండి పంచాయతీకి లక్షలాది నిధులు మంజూరయ్యాయి దేనికి ఎంత ఖర్చు పెట్టింది దొంగ బిల్లులు జత చేసుకొని ప్రజలకు వివరించారు. మధ్యలో ప్రజలు కాలువకు పైపులు వేసినందుకు 60000 ఎలా ఖర్చు అయిందని చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి ముళ్ళ కంచ వేసినందుకు కనీసం 50,000 కూడా ఖర్చు కాదు అలాంటి దానికి లక్ష యాభై వేల రూపాయలు ఖర్చు పెట్టడం ఇది న్యాయమా. పాత గ్రావెల్ రోడ్డుకు మూడు లక్షల 80 వేల రూపాయలు నిధులు ఎలా డ్రా చేశారని మరొకటి గ్రావెల్ రోడ్డుకు రెండు లక్షల రూపాయలు డ్రా చేశారని గ్రీన్ అంబాసిడర్ల ఒకరోజు కూడా చెత్త బండి దొబ్బని వారి పేరు పైన లక్షలు ఎలా డ్రా చేశారని ముఖ్యంగా గ్రామపంచాయతీలో వీధిలైట్లు లేవు ఎక్కడపడితే అక్కడ మురికి సిసి రోడ్లు లేవు ఎక్కడపడితే అక్కడపైపులైన్ వాటర్ లీకేజీ ప్రజలు ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటుంటే పంచాయతీ నిధులను గ్రావెల్ రోడ్ల రూపంలో వారి జోబి నింపుకోవడం న్యాయమా అని ప్రజలు ప్రశ్నించారు దీనికి సమాధానం చెప్పలేక గ్రామ సభలో అధికారులు వెళ్లిపోయారు. ఈ విషయంపై జిల్లా అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోకపోతే సమగ్ర నివేదికతో కలెక్టర్‌ను కలుస్తాం. డిప్యూటీ ఎంపీడీవో రహీంను వివరణ కోరగా గ్రావెల్ రోడ్డుకు మూడు లక్షల 80 వేలు రూపాయలు డ్రా చేసిన విషయం నాకు తెలియదని మిగిలిన విషయాలు అడిగితే సరైన సమాధానం చెప్పకుండా మా దగ్గర అన్ని రికార్డులు ఉన్నాయని సమాధానం దాటవేశారు. దీనిపై పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేసి చూద్దాం.



## వితంతు మహిళ ఆత్మహత్య

రామాపురం జూన్ 02. ప్రభాతవార్త
మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ మన్నేరు వాండ్ల పల్లె చెందిన మన్నేరు లత (38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాలుఇలా వున్నాయి వితంతువు అదే గ్రామానికి చెందిన వ్యక్తి తనకు ప్రేమించాలని లేకపోతే చనిపోతానని వేధిస్తూ ఉండడంతో కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక పురుగుల మందు తాగిడంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు సిఎంసికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు.

## రాష్ట్ర పునర్నిర్మాణం, ప్రజా సంక్షేమం చంద్రబాబు ధ్యేయం



ప్రొద్దుటూరు జూలై 2 ప్రభాతవార్త
గత వైసిపి పాలనలో రాష్ట్రం విధ్వంసం అయిన నేపథ్యంలో రాష్ట్ర పునర్నిర్మాణం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని టిడిపి నాయకులు నంద్యాల రాఘవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఒకటవ వార్డులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు రాష్ట్ర అభివృద్ధి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు ఏదైనా సమస్యలు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసిందని సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరిన ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ప్రొద్దుటూరు టిడిపి పరిశీలకులు ఏవిఆర్ ప్రసాద్ టిడిపి పట్టణ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, టిడిపి ఒకటవ వార్డు ఇన్చార్జి యనమల రామసుబ్బారెడ్డి, దాదిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఎనముల రాజారెడ్డి యనమల సుబ్బిరెడ్డి రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్ అహ్మద్ వాల్మీకి బోయ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు మాజీ కౌన్సిలర్ పొడాకుల వెంకటరమణ, జనసేన మురళి బచ్చల ప్రతాప్ టౌన్ బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి చింతకుంట కొద్ది నూర్జహాన్ గంజికుంట అంజి దుగ్గి రెడ్డి రఘునాథరెడ్డి మరియు బూత్ ఇన్చార్జులు క్లస్టర్ ఇంచార్జిలు యూనిట్ ఇన్చార్జి లు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కారు బోల్తా పడి వ్యక్తి మృతి

ముద్దనూరు, జులై 02, ప్రభాతవార్త:
మండల పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామ సచివాలయ సమీపంలో బుధవారం తాడిపత్రి పట్టణానికి చెందిన గుర్రం ప్రభాకర్, (ఫ్లెక్సీ వర్కర్) తేజేశ్వర్ ఇరువురు కలిసి సొంత పని నిమిత్తం కడప పట్టణానికి వెళ్లి సొంత గ్రామానికి తిరిగి వస్తూ ఉండగా కడప తాడిపత్రి జాతీయ రహదారిలోని శెట్టి వారి పల్లె గ్రామ సమీపంలో రాగానే అతివేగం కారణంగా అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కారులోని తేజేశ్వర్‌కు స్వల్ప గాయాలు కావడంతో హుటాహుటిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించిగా సిబ్బంది ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అజెండాను ఆచరణలో పెట్టి అమలు చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి

పీలేరు జూలై 2 ప్రభాతవార్త :
మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి అధ్యక్షతన కార్యదర్శి హరినాథ్ ఉపాధ్యక్షులు డైరెక్టర్లతో మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొన్ని అంశాలు తీర్మానించినట్లు పురం రామమ్మూర్తి అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వారికి మంజూరైన రైతు బజార్ పనులు త్వరగతిన నిర్మించుటకు మరియు నిధులు మంజూరు చేయుట, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయమున కు 2025 మే నెల వరకు వచ్చిన ఆదాయము మరియు పరిశీలించి ఆమోదించుట, తిరుపతి రోడ్డు మార్గంలోని గూడ్రేవుపల్లి పంచాయతీలో 760/6లో రెండు ఎకరములు స్థలము కలిగి ఉన్నదని ఆ స్థలములో కోల్డ్ స్టోరేజ్ నిర్మించుట, వీటన్నిటిని ఆచరణలోకి తీసుకొచ్చి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధి పథంలో నడిపిస్తూ రైతులకు అండగా నిలబడతారని ఆయన ఈ కమిటీ ద్వారా అందరిని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ రైతు మార్కెట్ యార్డ్ అభివృద్ధికి సహకరించి కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన అందరిని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేంద్ర రెడ్డి, మార్కెట్ యార్డ్ కార్యదర్శి హరినాథ్, డైరెక్టర్లు ఆదర్శ రైతు అమర్నాథ్ రెడ్డి, గోళ్ళ కిషోర్ నాయుడు, కలప రవి, పి రహంతుల్లా,రమాదేవి, లక్ష్మీకాంతమ్మ, సుబ్బయ్య, మల్లెల సాధన, వనిత, జె అనురాధ, కృష్ణమూర్తి, ఎం రజనీశ్రీ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యయ ధోరణిలో పంచాయతీ సిబ్బంది

పీలేరు జూలై 2 ప్రభాతవార్త :
పీలేరు పంచాయతీలో ప్రతి ఇంటిలోని చెత్తే కాకుండా పీలేరు ఏరియా ఆసుపత్రి మెడికల్ వేస్ట్ ను కూడా ట్రాక్టర్లతో సేకరించి పీలేరు ఇండస్ట్రియల్ ఏరియా లోని డంపియాడ్ లో పారబోయడం జరుగుతుంది. ట్రాక్టర్లో స్థాయికి మించి చెత్తను సేకరించి రోడ్ల వెంబడి పారబోసుకుంటూ మెడికల్ వేస్ట్ ను కూడా ఇష్టానుసారంగా రోడ్లపై పారబోసి నిర్లక్షయ ధోరణిగా పీలేరు పంచాయతీ సిబ్బంది వ్యవహరిస్తున్నారు. మెడికల్ వేస్ట్ ప్రాణాంతకం కాబట్టి పీలేరు పంచాయతీ ఈవో, సర్పంచ్ దీనిపై దృష్టి సారించాలని పీలేరు ప్రజలు కోరుతున్నారు.



## ఏం సాధించారని ఇంటింటికి సుపరిపాలన




బద్వేలు, జూలై 2, ప్రభాతవార్త
ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో ఘోరంగా విఫలమైందని, ఏడాది పాలనలో ఏం సాధించారని ఇంటింటికి సూపర్ పాలన పేరుతో వస్తున్నారో సమాధానం చెప్పాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు సంగటి చంద్రశేఖర్, చంద్ర మోహన్ రాజులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బద్వేల్ పట్టణంలో ని భగత్ సింగ్ నగర్ లో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రతి ఎన్నికల ప్రచారం సందర్భంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు, రైతు భరోసా, నిరుద్యోగ భృతి లాంటి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామంటూ హామీ ఇచ్చి నేటికి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గావస్తున్న ఒక్క పింఛను పెంపు తప్ప మిగతా ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. నేటికీ 50 సంవత్సరాల దాటిన వారికి ఇస్తామన్న పింఛను పథకం, రైతు భరోసా, నిరుద్యోగ భృతి పథకాలు ఏమాయనో సమాధానం చెప్పగలరా అని వారు ప్రశ్నించారు. సాంఘిక సంక్షేమ పాఠశాలలో సాక్షాత్తు రాష్ట్ర హోం మంత్రికే భోజనంలో బొద్దింక రావడం చూస్తుంటే ఈ ప్రభుత్వానికి పథకాల అమలులో ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతున్నదని వారు ఘాటుగా విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు జకరయ్య నియోజకవర్గ నాయకులు రామరాజు, బాబు, విజయరావు, జయరామరాజు విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ అనిల్ ఏరియా నాయకులు శంకర్, బన్నీ పార్టీ పట్టణ నాయకులు గంట మహబూబ్ బాషా, పాండు, పోలయ్య, శాంసన్, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ పథకంతో పేదలకు భరోసా



పెన్షన్ పథకంపై ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న తెదేపా నాయకులు

పీలేరు జూలై 2 ప్రభాతవార్త :
దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వితంతువులు, వృద్ధులు, వికలాంగులకు కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని అందజేస్తూ భరోసా ఇస్తున్నట్లు క్లస్టర్ కన్వీనర్ మల్లెల రెడ్డి భాష పీలేరు పట్టణ అధ్యక్షులు దశవాయి సురేష్ కుమార్ రెడ్డి, (కంచి సూరి) అన్నారు. కూటమి కార్యకర్తలతో కలిసి చెన్నారెడ్డి కాలనీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరిస్తూ వాళ్ల సమస్యలను తెలుసుకుంటూ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత వైసిపి ప్రభుత్వం లో ఐదేళ్ల కాలంలో వెయ్యి రూపాయలు మాత్రమే విడతలవారీగా పెంచారని, చాలీచాలని పెన్షన్తో తీవ్రం తీవ్ర ఇబ్బందులు పడే వారిని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వృద్ధులు వితంతువులకు 4000 రూపాయలు, వికలాంగులకు 6000 రూపాయలు, మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులకు 15 వేల రూపాయలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మన ఆంధ్ర రాష్ట్రంలో ఈ విధంగా ఇవ్వడం హర్షనీయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి కాలనీ హరి, కాలేషా, పీలేరు మండల మైనార్టీ అధ్యక్షులు అత్తర్ చాంద్ బాషా, ప్రముఖ మైనారిటీ నాయకులు షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

## కలికిరిలో అభివృద్ధిలో తొలి అడుగు



కలికిరి జూలై 2 ప్రభాతవార్త :
కలికిరి మండలంలో బుధవారం పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి లో తొలి అడుగు కార్యక్రమం విజయవంతం అయింది కలికిరి మేజర్ పంచాయతీ అమర్నాథ్ రెడ్డి కాలనిలో ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి కర పత్రాలు ద్వారా ప్రజలకు అందించి వివరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొకటి నెరవేరుస్తూ వస్తున్నారన్నారు ఇటీవలే ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్న వారందరికీ తల్లికి వందనమ ద్వారా ఆర్థిక సహాయం అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు కాలనీలు ఇండ్లు మంజూరు చేయాలనీ మంచినిటీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ని కోరారు. ఈ కార్యక్రమం లో కలికిరి మండలం టీడీపీ అధ్యక్షుడు నిజముద్దీన్ కలికిరి మండలం సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి చంద్రకుమార్ రెడ్డి కలికిరి మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మకర్ రెడ్డి కలికిరి మేజర్ పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు కలికిరి ఎంపీడీఓ భాను మూర్తి రావు డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ ట్రాన్స్‌కో ఏడి శివయ్య ట్రాన్స్‌కో ఏ ఇ ముజీ బర్ రహమాన్ ఏ పి ఒ మంజుల ఏ పి మ్ దేవసేన పంచాయతీ ఇవో అశోక్ మెడికుర్తి వైద్య అధికారిని లక్ష్మి ప్రసన్న హోసింగ్ ఏ ఈ చంద్రశేఖర్‌రెడ్డి కలికిరి పశు వైద్య శాల సహాయ సంచాలకులు వెంకట ముని నాయుడు విఆర్‌వోలు పాల్గొన్నారు.

## హార్సిలీహిల్స్‌ను అప్పగించడం ఉపసంహరించుకోవాలి

### ముఖ్యమంత్రికి సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ లేఖ

మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :
ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ ను రాందేవ్ బాబాకు అప్పగించే ప్రయత్నవం ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ లేఖ రాశారని నియోజకవర్గ కార్యదర్శి మురళి తెలిపారు. కార్పొరేట్ ముసుగులో ఉన్న రామ్‌దేవ్ బాబాకు యోగా అభివృద్ధి కోసం హార్సిలీహిల్స్ ఇవ్వడంపై అభ్యంతరం తెలిపారు. పేదల ఊటిగా పేరుగాంచిన హార్సిలీహిల్స్‌ను వివాదస్పద యోగా గురువు రామ్‌దేవ్ బాబాకి అప్పగించే ప్రతిపాదనలు ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. మదనపల్లెకు 20కిలోమీటర్ల దూరంలో హార్సిలీహిల్స్ కొండలు ఉన్నాయని ఈ కొండలు తిరమల కొండ కన్నా ఎత్తైనవని, 18వ శతాబ్దంలో బ్రిటీష్ ప్రభుత్వం హార్సిలీహిల్స్‌ను ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. ఈ కొండల్లో జంతు సంపద, వృక్ష సంపద అపారంగా ఉందన్నారు. ఈ కొండ సహజ సౌందర్యాలను చూసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రకృతి ప్రేమికులు వస్తూ ఉంటారన్నారు. ప్రపంచ తత్వవేత్త జిడ్డు క్రిష్ణమూర్తి ఫౌండేషన్ నిర్వహిస్తున్న రుషివ్యాలీ విద్యాకేంద్రం కూడా దగ్గరలో ఉందన్నారు. హార్సిలీహిల్స్‌ను బాబాకు ఇవ్వాలనే నిర్ణయాన్ని ఆపకపోతే పోరాటాలు చేస్తుందన్నారు.



లేఖ చూపుతున్న నారాయణ

## కనక దుర్గమ్మకు బోనాలు

రామసముద్రం జులై 2 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని గాజుల నగరం లో వెలిసిన కనకదుర్గమ్మ అమ్మ వారి జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు.ఆలయం చుట్టూ పచ్చని తోరణాలు కట్టి విద్యుత్ అలంకరణ తో గాజులు నగరం కళకలాడింది. మంగళవారం, బుధవారం అమ్మవారి కిమహిళలు ఉదయం ఉపవాస దీక్ష లతో దీపాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు బ్యాండ్ చప్పళ్లకు అనుగుణంగా నృత్యాలు చేశారు.కనకదుర్గమ్మ వారికి బెంగళూరు నుండి ప్రత్యేకంగా పుష్పలు తెప్పించి అలంకరణ చేసారు. మంగళ హారతులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు.బంధువులతో చుట్టు పక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులతో మండల కేంద్రంలోని గాజుల నందు సందడి.ఆలయ అర్చకులు భక్తులకు దర్శనబాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ

గాలివీడు, జులై 2(ప్రభాతవార్త):
కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు కోసం ఆర్డీఓ శ్రీనివాసులు స్థలాన్ని పరిశీలించారు. బుధవారం మండలంలోని తూముకుం గ్రామంలో తహసీల్దార్ భాగ్యలతతో కలిసి అనువైన స్థలం కోసం ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ వారి సహకారంతో 100 ఎకరాలలో బయోగ్యాస ఉత్పత్తి కేంద్రం ఏర్పాటులో భాగంగా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. సేంద్రీయ వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ వంటి వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భవానీశంకర్, మండల సర్వేయర్ మురళీ, హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రియల్టర్ ఆత్మహత్య

మదనపల్లి క్రైమ్ జూలై 2 ప్రభాతవార్త.
అప్పులు బాధ తాళలేక ఓ రియల్టర్ ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన బుధవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం, అమ్మినేనివీధికి చెందిన బొజ్జ రాజేంద్రప్రసాద్ (50) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇతనికి భార్య లత, కుమార్తె రిషిత లు ఉన్నారు. కృష్ణా నగర్ లో ఉన్న కార్యాలయం నందు వ్యాపార లావాదేవీలు జరిపేవాడు. వ్యాపార నిమిత్తం పలువురి వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేశాడు. వ్యాపారం నష్టాల్లో ఎక్కువ కావడం తో అప్పుల్లో కూరుకుపోయాడు. దీంతో అధిక వడ్డీలు కట్టలేక తీవ్ర మనస్థాపానికి గురి అయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేదని గ్రహించి మధ్యాహ్నం భోజనానికి వెళ్లే సమయంలో కార్యాలయం తలుపులు మూసుకుని అధిక వడ్డీలు ఎక్కువయ్యాయని, వాటిని కట్టలేని పరిస్థితుల్లో ఉన్నానని, చావు తప్ప వేరే మార్గం లేదని, భార్య, బిడ్డ లు తనను క్షమించమని కోరతూ సెల్ఫీ వీడియో తీసుకుని కార్యాలయంలోని ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని కోసం వెళ్ళిన స్థానికులు లోపల లాక్ వేసి ఉండడంతో కాసేపు తలుపు తట్టారు. స్పందన లేకపోవడంతో కిటికీలోంచి చూడగా రాజేంద్రప్రసాద్ ఉరికి వేలాడుతూ కనపడ్డాడు. దీంతో గట్టిగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు అక్కడికి చేరుకున్నారు. రాజేంద్రప్రసాద్ భార్య లత స్నేహితురాలు మాజీ కౌన్సిలర్ పులి మహాలక్ష్మి అక్కడికి చేరుకొని చూడగా అప్పటికే అతను మృతి చెంది ఉన్నాడు. ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఎంఈఓలపై చర్యలలో జాప్యమేల

ఎడ్యుకేషన్ జూలై 2 ప్రభాతవార్త :
విద్యాశాఖ చేపట్టిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీల మ్యాన్యువల్ కౌన్సిలింగ్ నందు ప్రిఫరెన్షియల్ కేటగిరిలో కేటాయించవలసిన స్థానాల కంటే అధికంగా కేటాయించి, బదిలీల చట్టం 2025ను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కడప, ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబులు ప్రశ్నించారు. వారిపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే జులై 9వ తేదీ కడప డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఈఓల నిర్లక్ష్య వైఖరి వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులతో పాటు ఒత్తిడికి గురయ్యారన్నారు. అధికారులు జరిగిన తప్పును గుర్తించి, కౌన్సిలింగ్‌ను రద్దుచేసి తిరిగి కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, తప్పును సరి చేయకుండా అర్థ రాత్రి తర్వాత బదిలీల ప్రక్రియను కొనసాగించారన్నారు.



## ఆర్అండ్‌బి స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :
ఆర్అండ్‌బి స్థలాలు ఆక్రమించుకొని అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ అరవిందా దేవికి బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునిత్ ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన బహుజన యువసేన ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి కార్యాలయంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పలుచోట్ల ఆర్అండ్‌బి స్థలాలను కొంత మంది అక్రమంగా ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారని, ఆర్అండ్‌బి కార్యాలయానికి అతి సమీపంలో ఉన్న ఎస్టేట్ దేవతానగర్ సమీపంలో ఎక్కువశాతం ఆర్అండ్‌బి స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్అండ్‌బి స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడే కాకుండా నిర్మించిన భవనాల్లో వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తోందన్నారు. అక్రమ నిర్మాణాలతో ఆర్అండ్‌బి ఆదాయానికి గండి పడుతోందన్నారు. మదనపల్లె-బెంగుళూరు రహదారి, రామసముద్రం రహదారుల్లో రోడ్డుపక్కన చెట్లు తొలగించి ప్రమాదాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బివైఎస్ నాయకులు హరిక్రిష్ణ, జిలానిబాషా, శశికుమార్, వినయ్, ద్వారక, నిజాం, సాధిక్, మనోజ్, తారక్, రమణ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

## బుద్దిని కొండలో విగ్రహాలు ధ్వంసం

మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :
పట్టణ సమీపంలోని అంకిశెట్టి వద్ద ఉన్న బుద్దిని కొండలో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాలను ధ్వంసం చేశారు. బుద్దిని తల నరికి కాళ్ళవద్ద ఉంచడం జరిగింది. ఇప్పటికే నాలుగు పర్యాయాలు బుద్దిని కొండలో విగ్రహాలను ధ్వంసం చేయడం జరిగిందని ట్రస్టు వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ తెలిపారు. గతంలో విగ్రహాల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే మళ్ళీ మళ్ళీ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నట్లు తెలిపారు. దిమ్మెపై నుంచి విగ్రహాన్ని కిందకు తోసి తలను నరికి కాళ్ళ దగ్గర పెట్టడం ఎంత దుర్మార్గమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. సిసి కెమరాలు ధ్వంసం చేసి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విగ్రహాలు ధ్వంసం చేసిన దృశ్యం

## కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

### నోటీసులు తిరస్కరించిన కార్మికులు

మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :
మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె బుధవారం 29వ రోజు యదావిధిగా కొనసాగించారు. అధికారులు ఇచ్చిన నోటీసులను తిరష్కరించి సమ్మెను కొనసాగించారు. వీరికి మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కార్మికులు చేపట్టిన దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బెదిరింపులతో పోరాటాలు ఆపలేరని, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. 30రోజులుగా కార్మికులు సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అనంతరం జేఏసి నాయకులు ఎంఎస్. కన్నయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలో, వీధిలైట్లు, తాగునీటి సరఫరాను బంద్ చేసి సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటిల్లోనూ శాంతియుత సమ్మె నిరసన చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరి స్తోందన్నారు. ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు అన్యాయం చేస్తున్నదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కూడా రాకుండా అన్యాయం చేస్తొందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ జేఏసి నాయకులు ఎస్.కె.రెడ్డప్ప,నాగరాజు, గోపాల్‌క్రిష్ణ, సజాద్‌కుమార్, బాలక్రిష్ణ, కుమార్, మహేష్, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.




సమ్మెలో పాల్గొన్న కార్మికులు

## తంబళ్లపల్లెలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరాలి



**తంబళ్లపల్లె జూలై 2 ప్రభాతవార్త :**
తంబళ్లపల్లె నియోజకవర్గం లో భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరడానికి ప్రతి కార్యకర్త సమిష్టి కృషి చేయాలని రాజంపేట టిడిపి అధికార ప్రతినిధి ఆర్ జె వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం తంబళ్లపల్లె లో రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాటకొండ మధుబాబుతో కలిసి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం కూటమి హవాతో వైకాపా మట్టి కరిచిన తంబళ్లపల్లె నియోజకవర్గం లో స్వల్ప తేడాతో ఓడిపోవడం బాధాకరమని అభిప్రాయ పడ్డారు. తంబళ్లపల్లె లోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు వర్గ విభేదాలు మాని ఐకమత్యంతో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. నేడు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ తో పాటు అభివృద్ధి సంక్షేమ పథకాలతో దూసుకుపోతోందని కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవినీతి వైకాపాను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. తొలుత ఆర్ జె వెంకటేష్, మధుబాబులను స్థానిక టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీర్ల పండుగ ఉత్సవానికి మంత్రికి ఆహ్వానం



**చిన్నమండెం, జూలై 2 ప్రభాత వార్త :**
మండల కేంద్రంలో అత్యంత ఘనంగా జరగనున్న మొహరం మహోత్సవం సందర్భంగా జరుగనున్న హాజరత్ గంధపు పీరు వారి పీర్ల పండుగ కార్యక్రమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని బోడిరెడ్డిగారిపల్లెలో వారినివాసంలో నిర్వాహకులు కలసి ఆహ్వానించారు. జూలై 5న రాత్రి 10 గంటలకు గంధపు పీరు బాసికం ఊరేగింపు చిన్నమండెంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను సమీక్షించిన నిర్వాహకులు, మంత్రి గారికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ పండగ మహోత్సవ సందర్భంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని పీర్ల మాఖన్ కమిటీ వారికి మంత్రి సూచన చేశారు.

## పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు



**ముద్దనూరు, జూలై 02, ప్రభాతవార్త:**
పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో 2024 25 సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉన్నత చదువుల అభ్యున్నతి కొరకు మంచి మనసుతో ఎక్కడో ఆస్ట్రేలియాలో ఉద్యోగ రీత్యా నివసిస్తున్న గజ్జల ప్రభాకర్ రెడ్డి లక్ష రూపాయలు నగదును వితరణ చేసినట్లు ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో ఉండటంతో మండల మాజీ ఎంపీపీ ముని రాజారెడ్డి చేతుల మీదుగా పదోతరగతిలోఉత్తమ ఫలితాలు సాధించిన పదిమంది విద్యార్థులకు తమ తల్లిదండ్రులు కీర్తిశేషులు గజ్జల చెన్నారెడ్డి, అచ్చమ్మ ల జ్ఞాపకార్థం మేరకు బుధవారం విద్యార్థులకు నగదు తో పాటు మెమెంటోను అందించారు. అనంతరం పాఠశాలల్లో మాజీ ప్రధానోపాధ్యాయులు రాజాబాబు, మాబు పదోన్నతి సందర్భంగా ఇరువురిని మాజీ ఎంపీపీ ముని రాజారెడ్డి ఘనంగా సత్కరించారు. ఇరువురు ఉపాధ్యాయులను ఉపాధ్యాయులు విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు బ్యాండ్ మేళాలతో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాలముని స్వామి రెడ్డి, డాక్టర్ నవజ్యోత్ రెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, గురు ట్రాన్స్పోర్ట్ అధినేత గుర్రప్ప, ఎంపీటీసీ జేడీ ఇంద్రాణి,శంకర్ రెడ్డి,రమణా రెడ్డి, రమేష్,కో ఆప్షన్ మెంబర్ ఖదీర్ భాష,జగదీశ్వర్ రెడ్డి,రామారెడ్డి,మణికంఠ రెడ్డి, సునీల్, భద్రి, సూర్యమునిరెడ్డి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ పరీక్ష ఫలితాలలో మెరిసిన విద్యార్థులు



**రాయచోటి జూలై 02 ప్రభాతవార్త**
అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ( అటానమస్) తృతీయ సంవత్సరం రెండవ సెమిస్టర్ ఫలితాల యందు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక శాతం మార్కులు సాధించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎప్పటిలాగే యూనివర్సిటీ విడుదల చేసిన తృతీయ సంవత్సర ఫలితాలు యందు కూడా కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి యూనివర్సిటీ పరిధిలో కళాశాలను అగ్రస్థానంలో నిలబెట్టారని తెలియజేస్తూ విద్యార్థులను మరియు కళాశాల అధ్యాపకులను అభినందించారు. తృతీయ సంవత్సర రెండవ సెమిస్టర్ ఫలితాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో సయ్యద్ సనా సాజియా 94.94 శాతం తో మొదటి ర్యాంకు, కలకడ సఫియా 89.89 శాతంతో రెండవ ర్యాంకు, పఠాన్ ముస్కాన్ 89.46 శాతంతో మూడవ ర్యాంకు మరియు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం నుంచి షేక్ మూలింటి సబిహా 89.5 శాతంతో మొదటి ర్యాంకు, ఎస్ హుమేరా 87 శాతంతో రెండవ ర్యాంకు, ఎం. వెంకట పవిత్ర 86శాతంతో మూడవ ర్యాంకు సాధించారని తెలియజేశారు. కళాశాలలో అకాడమిక్ అంశాలతో పాటు, కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్ రీజనింగ్ విభాగాలలో ప్రత్యేక శిక్షణ కల్పించి ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్నామని తెలియజేశారు. ఫలితాల యందు ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి .బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటరమణ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కరుణాకర్ వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు అభినందించారు.

## పీస్ కమిటీ మీటింగ్

**చిన్నమండెం జూలై 2 ప్రభాత వార్త:**
మండల కేంద్రంలో జరగనున్న పీర్ల పండుగ నేపథ్యంలో సుపీరియర్ అధికారుల ఆదేశంతో బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో స్థానికులతో పీఎస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీర్ల పండుగ సందర్భంగా ఏలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా హిందూ,ముస్లిం సోదరులు ఇద్దరూ కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ పండుగ సమయంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధి చేశాం : ఎమ్మెల్యే

**మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :**
కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధితో పాటు అనేక సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం పట్టణంలోని రెండవ వార్డు బికెపల్లెలో ప్రభుత్వ సుపరిపాలనపై తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యేప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డులో పర్యటించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తియిన సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ముఖ్యంగా పెరిగిన పించన్ విధానంపై వృద్దులు, దివ్యాంగుల్లో ఆనందోత్సవాలు నెలకొంటున్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పెన్షన్ రూ.4వేలు ఇచ్చిన ఘనత దక్కిందన్నారు. అదే విధంగా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉన్న వారికి తల్లికి వందనం పేరుతో ఒక్కరికి రూ.15వేలు, ఇంటర్ మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, అన్నాక్యాంటిన్, చౌకదుకాణాల వద్దే ప్రజలకు సౌకర్యంగా నిత్యవసర సరుకులు పంపిణీ, సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ, వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. పట్టణంలో ఇప్పటికే రూ.4కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వం కల్పించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వార్డు పర్యటనలో ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీల, వార్డు ఇన్‌చార్జ్ కవితా రఘుపతి నాయుడు, టిడిపి పరిశీలకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హామీలు అమలు పరచడమే లక్ష్యం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

**పీలేరు జూలై 2 ప్రభాతవార్త :**
రాష్ట్రంలో ఏడాదిగా పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఇంటికి సంక్షేమం అందితే, వైసిపి పాలనలో ఇంటింటికి మోసం జరిగిందని కూటమి పాలనలో ప్రజలకు సంక్షేమం అందించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి కూడా జరుగుతుందని, పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. "సుపరిపాలనలో తొలి అడుగు" అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అన్నమయ్యజిల్లా కలికిరి, వాల్మీకిపురం పట్టణాల్లో సుడిగాలి పర్యటన చేసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందించబోయే పథకాలను ప్రజలకు ఆయన వివరిస్తూ "డోర్ టు డోర్"ప్రచారం ప్రారంభించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా దాన్ని అధిగమించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి అందరికి వివరించారు. ప్రజలు త్రాగునీరు, పంచాయతీ కాలువలు, విద్యుత్, ఇళ్ల స్థలాల కొన్ని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే అధికారులు పిలిపించి సమస్యలు పరిష్కార మార్గం చూపించాలని అధికారులను సూచించారు. అలాగే మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో కొత్త సంస్కరణలు తీసుకొచ్చి విద్యకు పెద్దపీట వేశారని, అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రతి ఒక్కటి నెరవేర్చడమే కూటమి పార్టీ లక్ష్యమని ఆయన ప్రజలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కూటమి శ్రేణులు నాయకులు కార్యకర్తలు నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ప్రభుత్వ బాలుర వసతి గృహం తనిఖీ

**ఒంటిమిట్ట జూన్ 02( ప్రభాతవార్త)**



ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాను సారం చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప ఎస్. యామిని సూచనల మేరకు బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని బుధవారం తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు వసతి గృహంలోని రికార్డులను, విద్యార్థుల రిజిస్టర్ పట్టికలను, క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల రోజువారి మెనూ ప్రకారం హాస్టల్ సిబ్బంది విద్యార్థులకు అందిస్తున్న ఆహార పట్టికను పరిశీలించారు. హాస్టల్లోని పరిసరాలను, మరుగుదొడ్లను, ఆహారపు గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతూ సమయం ప్రకారం పౌష్టికమైన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించాలని క్రమశిక్షణ, అలవాట్లు, నడవడిక నేర్పించాలని పరిసరాలను ,శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆహారాన్ని క్రమబద్ధీకరణగా విద్యార్థులకు అందించాలన్నారు. గ్రామస్తుల నుంచి విద్యార్థుల నుంచి సిబ్బందిపై ఫిర్యాదులు అందినట్లయితే శాఖపరమైన చర్యలు తప్పమన్నారు. ప్రభుత్వం కేటాయించిన సమయం ప్రకారం సిబ్బంది సక్రమంగా తప్పకుండా హాజరు కావాలన్నారు. విద్యార్థుల పైన సిబ్బందికి తగు జాగ్రత్తలు ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. హాస్టల్లో విద్యార్థులకు భద్రత పెంచాలన్నారు. జవాబుదారీ తమదేనన్నారు. హాస్టల్లో ఏవైనా సమస్యలు ఉంటే జిల్లాస్థాయి దృష్టికి తీసుకుని వచ్చినట్లయితే క్షేత్ర పరిపాలకులు పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, వాచ్మెన్ తదితరులు పాల్గొన్నారు.

## గానమే నా ప్రాణం ..

**కడప కార్పొరేషన్, జూలై 2 ప్రభాతవార్త:**
కడప నగరంలో నీ గానమే నా ప్రాణం పేరుతో అయ్యప్ప అఖండ నామ సంకర్తీన కార్యక్రమం ఘనంగా జరిగింది. బుధవారం కడప నగర శివార్లలోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్‌దేశ్‌పాండే ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో మూడు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్త బృందం పాల్గొంది. తొలుత రాజ్‌దేశ్‌పాండే కాషాయ ధ్వజా రోహణం చేసి భక్తి శ్రద్దలతో గోపూజ చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షులు దేశు వెంకటరెడ్డి, కార్యదర్శి వాసు గురుస్వామి, జిల్లా అధ్యక్షులు దేవతి శంకరయ్య, వి హెచ్ పి జిల్లా అధ్యక్షులు నందారపు చెన్నకృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఉ.6 నుంచి సా. 6 గం.ల వరకు ఏకధాటిగా అయ్యప్పస్వామి అఖండ నామ సంకీర్తనలు కొనసాగా అన్నారు. అయ్యప్ప భక్తులు భజనలు, పాటలు భక్తులను భక్తి పారవశ్యంతో నింపాయని తెలిపారు. సా. అయ్యప్పస్వామికి అభిషేకం, పడిపూజ కార్యక్రమాలు, గురుస్వాముల ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా అతిథులకు సత్కార కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పోతుల వెంకటరామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, శ్రీ రంజన్‌రెడ్డి, వెంకట సుబ్బయ్యతోపాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



## త్రోబాల్ పోటీల్లో శ్రీవేద పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**మదనపల్లె, జులై 2 ప్రభాతవార్త :**
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజనల్ త్రోబాల్ పోటీలకు శ్రీవేద పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ లక్ష్మినారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డిలు తెలిపారు. ఇటీవల కడపలో జరిగిన సిఐఎస్ఈ జోనల్స్ త్రోబాల్ పోటీల్లో శ్రీవేద విద్యార్థులు విశేష ప్రతిభ కనపరచి ద్వితీయస్థానం కైవసం చేసుకొన్నట్లు తెలిపారు. ఇందులో ఎస్.ధనవర్షిణిరెడ్డి, ఎం.నాగఅబిన్జ, జె.చరిత, ఎస్.భానురెడ్డిలు రీజనల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు త్వరలో రీజనల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, పిఈటి, పీడిలు అభినందించారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండండి



**తంబళ్లపల్లె జూలై 2 ప్రభాతవార్త :**
నేటితరం విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని తంబళ్లపల్లె ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి ఉపదేశించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సెల్ ఫోన్ ద్వారా మంచిని తీసుకుని చెడును దూరం చేయాలని విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. బాలికలు గృహహింస, ఫోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. యువత సైబర్ నేరాలతో పాటు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఈ విషయాలపై విద్యార్థులు తల్లిదండ్రులతోపాటు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దిన్నెపాడులో సూపరిపాలన తొలి అడుగు

**లక్కిరెడ్డిపల్లి : జులై 02 ప్రభాత వార్త**
మండల పరిధిలోని దపేపల్లి, దిన్నెపాడు, అనంతపురం గ్రామాలలో మన మంచి ప్రభుత్వం యొక్క సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి , ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ల సూచనల మేరకు లక్కిరెడ్డిపల్లి మండల ఇంచార్జ్ యనమల మదన్ మోహన్ తెలుగు తమ్ముళ్ల తో అట్టహాసంగా ప్రారంభించారు. ఇంటింటికి కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భవిష్యత్తులో ప్రజా సంక్షేమ పాలన ఎలా ఉంటుందో వివరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు ప్రభుత్వం నుండి అందుతున్న పథకాలు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల ఇంచార్జ్ యనమల మదన్మోహన్ మాట్లాడుతూ దుబారా కంటే ప్రజలకు కావలసిన అన్ని సౌకర్యాలు, వసతులతో పాటు రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం అభివృద్ధి కూడా వేగవంతంగా చేస్తున్నామని, ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధితో రాష్ట్రం వేగంగా ముందుకు వెళుతుందని, ఒక ఏడాదిలో తాము చేసిన పథకాలను సగవురవంగా ప్రజల ముందుకు తీసుకు వచ్చామని, భవిష్యత్తులో అన్ని హామీలతో పాటు అందరి సంక్షేమం దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా, రాష్ట్రం అభివృద్ధి చెందేలా పాలన ఉంటుందని అందుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్, చలపతి, రమణయ్య, బోనాల దన, రవిశంకర్ రాయల్, ఓబులేసు, హేమంత్, కిట్టు, ఉమహేశ్వర్ రెడ్డి, ఓబులేసు, బోనాల ధన, చిన్న రెడ్డయ్య, వేమయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్ గురైన ఎలక్ట్రీషియన్

**మదనపల్లి క్రైమ్ జూలై 2 ప్రభాతవార్త.**
విద్యుత్ లైన్ లో ఏర్పడిన అంతరాయానికి మరమ్మత్తులు చేస్తున్న కూలీకి కరెంట్ షాక్ కొట్టి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె పట్టణం ఎన్టీఆర్ సర్కిల్ లో అర్ధరాత్రి ఓ లారీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ఫోల్ ను ఢీకొనడంతో పోల్ విరిగిపోయి కరెంట్ తీగలకు వేలాడుతూ నిలబడింది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు కాంట్రాక్టర్ నరసింహయ్య ద్వారా పక్కనే మరో పోల్ ను ఏర్పాటు చేశారు. విరిగిన పోయిన పోల్ నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన పోల్ లోకి విద్యుత్ తీగలను మార్చేందుకు కాంట్రాక్టర్ నిమ్మనపల్లి మండలం, తవళం గ్రామం, ఉంటావారిపల్లెకు చెందిన రామప్ప కుమారుడు వి.వెంకటరమణ(35) ను పిలిపించాడు. లైన్ ఇన్స్పెక్టర్ మస్తానయ్య, ఎనర్జీ అసిస్టెంట్ శ్రీనివాస్ లు సూచనతో మరమ్మత్తులు చేయటానికి కరెంట్ ఫోన్ పైకి ఎక్కాడు. ఆ కూలి పోల్ ఎక్కి వైర్లను ముట్టుకోగానే అందులో విద్యుత్ సరఫరా ఉండడంతో షాక్ గురై పోల్ పైనే కుప్ప కూలిపోయాడు. అప్పటికప్పుడు విద్యత్ సరఫరా నిలిపివేసి, తీగలపై పడిన కూలి వెంకటరమణ ను ప్రథమ చికిత్సలు చేయించి, మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తొలి అడుగు డోర్ టు డోర్‌లో మంత్రి



**సంబేపల్లి జూలై 2 ప్రభాతవార్త**
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు బుధవారం సంబేపల్లి మండలం దేవపట్ల రౌతు గుంట గ్రామాలలో ఆయన స్థానిక మండల నాయకులతో కలిసి పర్యటించారు కార్యక్రమం ముందుగా దేవపట్ల గ్రామంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి జెండా ఆవిష్కరించారు అనంతరం డోర్ టు డోర్ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అందించినసంక్షేమ పథకాల ప్రజల గురించి తెలియ జేస్తూ అభివృద్ధి సంక్షేమ పథకాల తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం పథకం అన్నా క్యాంటీన్ లో పునర్దరణ, ,గురించి వివరించారు ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియ జేస్తూ రాబోయే ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు. అంగవైకల్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్త నడపన్న కుమార్తెను పరామర్శించిన మంత్రి రౌతు గుంట గ్రామం బోయపల్లిలో టిడిపి కార్యకర్త నడిపిన కుటుంబంలో పూర్తిగా అంగవైకల్యంతో గల కూతురు రెండు కిడ్నీలు పాడైపోయిన కొడుకును డోర్ టు డోర్ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి చించారు వారి వైద్యానికి ఆర్థిక సహాయం ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను వర్తింపజేయాలని అధికారులకు ఆదేశించారు కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు టిడిపి కార్యకర్తలు మండిపల్లి అభిమానులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే

**మైదుకూరు, జులై 02, ప్రభాతవార్త:**
సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ 18 వ వార్డు నంద్యాల రోడ్డు రాజీవ్ కాలనీ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్,ఇంటింటి పర్యటనలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని, వెంటనే సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించమని ఆదేశించారు.ఏపీలో కూటమి పాలనకు ఏడాది పూర్తవగా, ఇవాల్టి నుంచి టీడీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్య కర్తలు ప్రజల్లోకి వెళ్లాలని సుపరిపాలనలో తొలి అడుగు 4.1ఖి పేరుతో ఏడాది పాలనలో ఏం చేశారో, భవిష్యత్తులో ఏం చేయబోతున్నారో నెల రోజుల పాటు ప్రజలకు వివరించనున్నారు. ఇప్పటివరకు అమలు చేసిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు వార్డు కౌన్సిలర్, కూటమి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## చిరుధాన్యాల సాగులో
# మెలుకువలు, నిర్వహణపై శిక్షణ

**ఖాజీపేట, జులై 02, ప్రభాతవార్త:**
ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లి గ్రామంలో బుధవారం నాడు ఏరువాక కేంద్రం కడప వారి ఆధ్వర్యంలో చిరు ధాన్యాల సాగులో మెలకువలు, సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగార్చన నిర్వహించారు. గ్రామంలోని మహిళలు మరియు నిరుద్యోగ యువత కోసం మెరుగైన ఆరోగ్యం మరియు వ్యవస్థాపక అభివృద్ధి కోసం చిరుధాన్యాల సాగులో కీలక నిర్వహణ పద్ధతులపై షెడ్యూలు కులాల ఉపప్రణాళిక పథకం క్రింద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రాధాన్యత గురించి ఏరువాక కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ పరిస్థితి ఏమైనప్పటికి పండించగల పంట చిరు ధాన్యాలు అని తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో పండించగల పంట చిరుధాన్యాలు అని, ఈ పంటను వర్షాధార పంటగా కూడ పండించవచ్చునన్నారు. అంతేకాకుండా చిరుధాన్యాలలో పురుగు మరియు తెగుళ్ల చాలా తక్కువ అని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారిణి నాగార్జన మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్ల వాడకం, యాంత్రీకరణ ఆవశ్యకత, వ్యవసాయంలో డ్రోన్‌ల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. అంతేకాకుండా ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల రాయితీ గురించి గ్రామ ప్రజలకు తెలియజేశారు. డాక్టర్ ప్రశాంతి సైంటిస్ట్ కమ్యూనిటీ సైన్స్ చిరుధాన్యాల రకాలు మరియు ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలిపారు. అన్ని వయసుల వారు చిరుధాన్యాల వినియోగాన్ని పెంచాలని ఆమె అభ్యర్థించారు. చిరుధాన్యాలు పేగు ఆరోగ్యానికి, రక్తపోటును తగ్గించడానికి, డయాబెటిస్, ఎముకల ఆరోగ్యానికి మొదలైన వాటికి మంచిదని తెలియజేస్తూ చిరు ధాన్యాల విలువ జోడింపును ఉపయోగించి చిన్న తరహా వ్యాపారం గురించి ప్రత్యేకంగా తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మహిళలు ఆసక్తితో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నలతో బిస్కెట్స్ ఎలా తయారు చేయాలో కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొజెక్టర్ సహాయంతో వివిధ వీడియోల ద్వారా పాల్గొన్న మహిళలకు చిరుధాన్యాల వివిధ వంటకాలు తయారీ గురించి అవగాహణతో కూడిన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేష్మ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.





